క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు మార్కాపురం బాలికలు ఎంపిక


లక్ష్య


నాగభార్గవి

మార్కాపురం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ జోలా శ్యామలాదేవి తెలిపారు. ఈనెల 24న సింగరాయకొండలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మార్కాపురం విద్యార్థులు పి.లక్ష్య, ఎ.నాగభార్గవి గెలుపొందారని వివరించారు. చెస్‌లో సత్తా చాటిన బాలికలను అభినందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య సిబ్బంది

గిద్దలూరు రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ బి.జ్యోతి పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.ఎస్.పల్లె, కంచిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవడంలో అశ్రద్ధ చేయవద్దని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకకు పాల్పడకుండా లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మల్లికార్జునరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాధన కాలేజీ రూ.లక్ష విరాళం


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్

మార్కాపురం: ముఖ్యమంత్రి సహాయ నిధికి సాధనా కాలేజీ సంస్థల తరఫున లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే నారాయణరెడ్డికి మంగళవారం అందజేశారు. ఇటీవల విజయవాడలో వరదల్లో సర్వం కోల్పోయిన ప్రజలకు చేయూతనిచ్చేందుకు విరాళం అందజేసినట్లు కళాశాల డైరెక్టర్లు జీఎల్ రమేష్‌బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సాధనా కళాశాలల అధ్యాపకులు ఒకరోజు వేతనంతోపాటు విద్యార్థుల సహకారంతో విరాళం అందించినట్లు వివరించారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన యువకుడు

తర్లుపాడు: మండలంలోని మేలకవారిపల్లి టోల్ ప్లాజా సమీపంలో బైక్ అదుపు తప్పి గేదెలను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గేదె దూడ అక్కడికక్కడే మృతి చెందింది. యువకుడిని చికిత్స నిమిత్తం టోల్ ప్లాజా అంబులెన్స్‌లో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది.

వాన కురిస్తే.. హైరానా


పొదిలిలో వర్షంలోనే బస్సు కోసం వేచిఉన్న విద్యార్థులు

పొదిలి: స్థానిక పెద్ద బస్టాండ్‌లో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ పాఠశాలలు వదిలిన తరువాత బస్సుల కోసం విద్యార్థులు అధిక సంఖ్యలో పెద్ద బస్టాండ్ చేరుకుంటారు. దర్శి రోడ్డులోని కుంచేపల్లి, మల్లవరం గ్రామాలవైపు, ఒంగోలు రోడ్డులోని కాటూరివారిపాలెం, తలమల్ల, గ్రామాలకు వెళ్తుంటారు. వర్షాకాలంలో బస్ షెల్టర్ లేకపోవడంతో వర్షానికి తడుస్తూ బస్సుల కోసం వేచి ఉంటున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాలు, దుస్తులు తడిచి ముద్దయిపోతున్నాయని, జలుబు, జ్వరంతో బాధపడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి పెద్ద బస్టాండ్‌లో ఆక్రమణలు తొలగించి బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బెంబేలెత్తిస్తున్న శునక సేన


పోలీస్‌స్టేషన్ సమీపంలో సంచరిస్తున్న శునకాలు

బేస్తవారిపేట: మండల కేంద్రమైన బేస్తవారిపేటలో గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాణిపేట, బీసీకాలనీ, స్టేట్‌బ్యాంక్, పోలీస్‌స్టేషన్, టీచర్స్ కాలనీలో గుంపుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. సాయంత్రం వేళల్లో ద్విచక్ర వాహనాలను వెంబడిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రోడ్లపైకి రావాలంటే వణికిపోతున్నారు. చిన్నపిల్లలు కనిపిస్తే శునకాల సేన వెంటపడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి శునకాల బెడద తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


కొమరోలు : సూచనలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్


తాడివారిపల్లిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో వెంకటేశ్వర్లు, అధికారులు

గిద్దలూరు రూరల్: రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జెడ్పీటీసీ బుడత మధుసూధనరావు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సంజీవరాయుడుపేటలో రైతులకు అవగాహన కల్పించారు. కంది పంటను పరిశీలించడంతోపాటు పశువులల్లో అధిక పాల ఉత్పత్తి వ్యాధి నివారణ టీకాలు వేయించారు. కార్యక్రమంలో ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ, పశు వైద్యాధికారి శ్రావణ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం

కంభం: రైతులు అధునాతన పద్ధతులు పాటించాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తురిమెళ్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను త్వరితగతిన రైతులకు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు డి.స్వరూప, ఏఓ పాపారావు, ఉద్యానశాఖ అధికారి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సాగులో నూతన సాంకేతికతో మేలు

బేస్తవారిపేట: వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని జెడ్పీటీసీ బీవీ రాజయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'పొలం పిలుస్తోంది' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఓ మాట్లాడుతూ.. డ్రోన్లతో పురుగు మందులు పిచికారీ చేయడం ద్వారా తక్కువ ఖర్చుతోపాటు సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ జక్కం మెర్సీ, జేబీకే పురం, చెట్టిచర్ల సర్పంచ్‌లు కె.వెంకటలక్ష్మమ్మ, పోతుల వెంకట కృష్ణారెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ, ఉద్యానవనశాఖ అధికారులు ఏవీ రంగారెడ్డి, వైసీహెచ్ శేషగిరి పాల్గొన్నారు.


బేస్తవారిపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ రాజయ్య

◆ అర్ధవీడు మండలంలోని మొహిద్దీన్‌పురం, బోగోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ షేక్ మహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి, మిరపలో తెగుళ్లు, సూక్ష్మపోషకాల లోపం నివారణకు సూచనలిచ్చారు. ఏఈఓ శివగంగ ప్రసాద్, వీఏఏ భారతి పాల్గొన్నారు.

కొమరోలు: సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాతిరెడ్డిపల్లె, రాజుపాలెంలో రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ, వ్యవసాయ సహాయకులు శివరాములు, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

పొదిలి రూరల్: మండలంలోని పాలముల పాడు, కుంచేపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సజ్జ, కంది రైతులకు ఏఓ జైనులాబ్దిన్ అవగాహన కల్పించారు. వారంలో రెండు రోజులు వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నగురువాయపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ మంచికల మణిశేఖర్, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గించి, అధిక దిగుబడి సాధించే విధంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి రమేష్, ఏఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లి, మీర్జపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో జింకు, ఆకుముడత నివారణకు ఏఓ వెంకటేశ్వర్లు సూచనలిచ్చారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి గడ్డిజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవీఏస్‌లు నందన, పాందు రంగ స్వామిరెడ్డి, మీర్జపేట సర్పంచ్ పెద్ద మీరయ్య, తాడివారిపల్లి సర్పంచ్ జాన్‌రత్నం, వైస్ సర్పంచ్ జనార్దర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి


ఎక్సైజ్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు

● ఎక్సైజ్ అధికారులకు సూపర్‌వైజర్ల వినతి

మార్కాపురం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్ల సంఘ నాయకులు మంగళవారం మార్కాపురంలోని ఎక్సైజ్ డిపో మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు నందిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కుమార్ బాబు, కేవీ బ్రహ్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్బారావు, ఉస్మాన్ తదితరులు మాట్లాడుతూ.. తాము గత కొన్నేళ్లుగా ప్రభుత్వ వైన్ షాపుల్లో సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3600 ప్రభుత్వ మద్యం షాపులను ఏర్పాటు చేసి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తమను అధికారికంగా ఎంపిక చేశారని వివరించారు. రాష్ట్రంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి కొత్త మద్యం పాలసీకి కేబినెట్ ఆమోదం తెలపడంతో రాష్ట్ర వ్యాప్తంగా 15వేల మంది నిరుద్యోగులుగా మారుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తమను ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసి విధుల్లో కొనసాగించాలని కోరారు. లేదంటే తమ కుటుంబాలు వీధినపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తామెవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మార్కాపురం డివిజన్‌లో మొత్తం 101 షాపుల్లో సుమారు 400 మంది వరకు సేల్స్‌మెన్లు, 200 మంది వాచ్‌మెన్లు, 100 మందికిపైగా సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారని తెలిపారు.

అట్టహాసంగా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు


జిల్లా స్థాయికి ఎంపికైన అరవింద స్కూల్ విద్యార్థులతో పీఈటీ


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

అండర్ 14, 17 విభాగాల్లో విద్యార్థులకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపనున్నట్లు ఎంఈఓ రాందాస్‌నాయక్ తెలిపారు. జెడ్పీ హైస్కూల్‌కు చెందిన అభి అథ్లెటిక్స్ అండర్ 17 విభాగంలో ద్వితీయ స్థానం, అండర్ 14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో మహేష్ ప్రథమ స్థానం, అండర్ 17 చెస్‌లో ఎస్.కౌశిక్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈఓ వివరించారు.

అరవింద్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పట్టణంలోని అరవింద స్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సి.వాణీ రాధాకృష్ణ తెలిపారు. పాఠశాలకు చెందిన జి.శ్రీనివాసనాయుడు షాట్‌పుట్ అండర్ 17లో ప్రథమ స్థానం, చెస్ అండర్ 14లో శ్రీకాంత్, శుభకర్ మొదటి, రెండో స్థానాల్లో, అలాగే 400 మీటర్ల పరుగుపందెంలో జయరాజు 3వ స్థానంలో నిలిచారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం


మార్కాపురం : ర్యాలీలో పాల్గొన్న కిట్స్ కళాశాల విద్యార్థులు

మార్కాపురం: స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి పార్కులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ ఆర్ఎం రఘురామ్ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు పీకి పరిసరాలను శుభ్రం చేశారు. ఆర్ఎం మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా వ్యాపారమే కాకుండా సామాజిక సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు, అసిస్టెంటు మేనేజర్లు, బ్యాంకు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవినాయక్ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొమరోలులో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



మార్కాపురం : పార్కులో పరిసరాలు శుభ్రం చేస్తున్న ఏపీజీబీ ఉద్యోగులు

మార్కాపురం టౌన్: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం మానవజాతి మనుగడకు పెనుముప్పుగా తయారైందన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని విద్యార్థులకు సూచించారు. కాలేజీ ఆవరణలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పీవీ అనిల్ పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు దేవరాజుగట్టు పంచాయతీ, పెద్దారవీడు పోలీసుస్టేషన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, హెచ్ఓడీలు రామ్మోహన్, అనీల్‌కుమార్, రాముడు, కిశోర్‌బాబు, ప్రసన్నమురళి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

గిద్దలూరు రూరల్: పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని కమిషనర్ డి.వెంకటదాసు పేర్కొన్నారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. భోజనం తెచ్చిన పాత్రలు, తినే వారికి ఇస్తున్న ప్లేట్ల శుభ్రతను పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని క్యాంటీన్ సిబ్బందికి సూచించారు. ఆహార నాణ్యతపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. నగర పంచాయతీ కౌన్సిల్ సభ్యుల సూచన మేరకు అన్నా క్యాంటీన్ పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి


కుంకుమ బండ్ల ఊరేగింపులో భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట పంచాయతీ పేరారెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి, పోలేరమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ముగిసి 40 రోజులైన సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవం నిర్వహించారు. మంగళవారం రాత్రి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు చెల్లించారు. గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని కోరుతూ అమ్మవారిని దర్శించుకున్నారు.

స్కూల్ గేమ్స్ విజేతలకు సన్మానం


తర్లుపాడు : విజేతలతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

తర్లుపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్‌లో విజయం సాధించిన స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులను హెచ్ఎం సుధాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అండర్ 14 హైజంప్‌లో నిఖిలేష్ ప్రథమ స్థానం, బాలికల పరుగు పందెంలో ప్రసన్న ప్రథమ స్థానం, బాలికల షాట్‌పుట్‌లో నిహారిక ద్వితీయ స్థానం, అండర్ 17లో 800 మీటర్ల బాలికల పరుగు పందెంలో జయమ్మ ప్రథమ స్థానం, బాలికల 1500 మీటర్ల రన్నింగ్‌లో రేష్మ ద్వితీయ స్థానం, బాలికల షాట్‌పుట్‌లో హేమలత ప్రథమ స్థానం, డిస్కస్‌త్రోలో హేమలత ద్వితీయ స్థానం, బాలుర 400, 800 మీటర్ల పరుగు పందెంలో అంజినాయక్ ప్రథమ స్థానం, 3 వేల మీటర్లలో పరుగు పందెంలో అజయ్ ప్రథమ స్థానం, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో మౌలాలి ద్వితీయ స్థానం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో లక్ష్మణ్ ప్రథమ స్థానం, చెస్‌లో సురేష్ ప్రథమ స్థానం సాధించారని హెచ్ఎం వివరించారు.